క్లుప్తంగా

'ఉపాధి' బకాయిలు చెల్లించాలి

సీతంపేట: ఉపాధి హామీ పథకం బకాయి వేతనలు వెంటనే చెల్లించాలని గిరిజన సంఘ నాయకులు పి.సాంబయ్య, భాస్కరరావు, జె.శ్రీరాములు, తదితరులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉపాధి పనులు నిలిపివేయడం వల్ల వేతనదారులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి బకాయి వేతనాలు వెంటనే జమ చేయాలని కోరారు.

జర్మన్ భాషపై శిక్షణ

సీతంపేట: జర్మన్ భాషపై నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు అన్నందొర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారు ఈనెల 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ, నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ కలిపి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. యూరప్ దేశాల్లో నర్సింగ్ గ్రాడ్యుయేట్లకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విశాఖపట్నంలో 8 నుంచి 9 నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలుంటాయని చెప్పారు. 35 ఏళ్ల లోపు వయసుండి, బీఎస్సీ పూర్తి చేసి, రెండేళ్ల క్లినికల్ అనుభవం ఉండాలన్నారు. వివరాలకు స్థానిక గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అయ్యప్పస్వామి ఆలయంలో దొంగల హల్‌చల్

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి అయ్యప్పస్వామి ఆలయంలో దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగలు మందిరం తలుపులకు ఉన్న గడియలు, తాళాలు విరగ్గొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. అందులో నగదు లేకపోవడంతో దొంగలు వెనుదిరిగారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు తెలిపారు. కొన్నిరోజుల క్రితం ఇదే గ్రామ సమీపంలోని ఘటాలమ్మ గుడిలో చోరీ జరగ్గా, ఇప్పుడు ఇలా అయ్యప్పస్వామి ఆలయంలో దొంగలు పడడం పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తప్పిన ప్రమాదం

పాలకొండ: పట్టణంలోని మార్కెట్ రోడ్డులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఓ దుకాణంపై ఒక్కసారిగా భారీ వృక్షం పడిపోయిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న వారిపై చెట్ల కొమ్మలు పడడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించారు. దుకాణాలకు పాక్షికంగా నష్టం వాటిల్లింది.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

జియ్యమ్మవలస: గంజాయి, ఖైనీ, గుట్కా, సిగరెట్, సారా, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చినమేరంగి ఎస్‌ఐ అనీష్ తెలిపారు. సోమవారం మండలంలోని చినమేరంగిలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చాలా మంది ఫ్యాషన్ మాయలో పడి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి నడవడికను అలవర్చుకుని, ఉత్తమ జీవనం సాగించాలని కోరారు.

సాగునీరు అందించండి



పాలకొండ రూరల్: మండల పరిధిలోని ఆయకట్టుకు ఈ నెల 8వ తేదీ నాటికి పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు పలువురు రైతులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ సావిత్రికి సోమవారం వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నాయకుడు అప్పలనాయుడు మాట్లాడుతూ.. తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ టైలెండ్ గ్రామాలకు సాగునీరు నేటికి అందలేదన్నారు. దీంతో నాట్లు వేసిన పంట భూములు, నారుమడులు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 8వ తేదీలోగా నీరు విడిచిపెట్టకపోతే పదో తేదీనుంచి ఆందోళనబాట పట్టక తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎ.చిన్నంనాయుడు, పి.రమణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలూ.. నారు ముదిరినా ఆందోళన వద్దు

- యాజమాన్య పద్ధతులు అవలంభిస్తే మెరుగైన ఫలితాలు
- ఏఓ ఎస్ఎస్ఆర్‌వీ ప్రసాద్



ఎస్.ఎస్.ఆర్.వీ.ప్రసాద్



నారు కట్టలు కడుతున్న రైతులు

పాలకొండ రూరల్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచీ రైతులు అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గ రైతుల్లో ఎక్కువ మంది వర్షాధారంపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో అడపా దడపా వర్షాలు కురిసినా అవసరం మేర సాగు నీటి నిల్వలు లేకపోవడంతో రైతులు సాగుకు ఇబ్బంది పడుతున్నారు. తోటపల్లి కాలువల ద్వారా వచ్చిన నీటితో వీరఘట్టం మండలంలో ఉభాలు పూర్తయినా.. పాలకొండ మండలం టైలెండ్ గ్రామాలకు సాగునీరు అందక రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సుమారు ఏడు వందల హెక్టార్లలో సాగు ఆలస్యమైందని అధికారుల అంచనా. సీతంపేట మండలంలో అత్యధికంగా పోడు వ్యవసాయంపై గిరిజన రైతులు ఆధారపడగా.. భామిని మండలంలో వ్యవసాయ బోర్లను నమ్మి రైతులు సాగుకు ఉపక్రమిస్తున్నారు. ఆగస్టు మొదటి వారం గడిచిపోతున్నా నీటి వసతి అందక, ముందుగానే సిద్ధం చేసుకున్న వరి నారుకు కూడా నీటి తడులు అందించకపోవడంతో నారు ఎండిపోతోంది. ముదురు నారు నాటుకునే సమయంలో అన్నదాతలు మెలకువలు పాటిస్తే దిగుబడులు యథాతథంగా వస్తాయని, దీని వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని మండల వ్యవసాయాధికారి ఎస్ఎస్ఆర్‌వీ ప్రసాద్ తెలిపారు.

ఇలా చేస్తే మేలు..

- వర్షాధారం, సాగునీటి కాలువల ద్వారా నీరు లభ్యతకు అనుగుణంగా ఉన్న భూముల్లో ముదురు వరినారు నాటే క్రమంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి.
- ముఖ్యంగా 35 నుంచి 50 రోజుల నారు వయసు ఉంటే చదరపు మీటరుకు 44 కుదుళ్లు.. 50 నుంచి 65 రోజుల వయసుంటే చదరపు మీటరుకు 66 కుదుళ్లు ఉండేలా మొనలు వేసుకోవాలి.
- ముదురు నారును లోతుగా నాటితే దిగుబడి తగ్గే అవకాశం ఉంది. అందువల్ల నాట్లు తక్కువ లోతులో వేస్తే పిలకలు అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది.
- ఈ తరహా నారు నాటేటప్పుడు నిర్ణీత విస్తీర్ణంలో కుదుళ్ల సంఖ్యను పెంచి కుదురుకు దగ్గర దగ్గర 4 నుంచి 5 మొక్కలు వంతున వేయాలి.
- సిఫార్సు చేసిన మోతాదు కంటే 25 శాతం పెంచి 3 దఫాలుగా కాకుండా 2 దఫాలుగా ఎకరానికి 50 కిలోల డీఏపీ, 35 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ ఆఖరు దమ్ములో వేసుకుని మిగతా 30 శాతం అంటే 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ అంకురం దశలో వేయాలి.
- నత్రజని ఎరువులను బురద పదునులో మాత్రమే సమానంగా వెదజల్లి 36 – 48 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలి.
- నారు ఊడిచేందుకు సన్నద్ధం చేసేటప్పుడు నారు చివర మొనలు తుంచి నాటాలి. ఇలా చేయడం వల్ల నారులో ఉండే కీటకాలను నియంత్రించవచ్చు.
- ముఖ్యంగా కాండం తొలుచు పురుగు ఆకు కొనలపై పెట్టిన గుడ్లు నాశనమవుతాయి.
- నాట్లు ప్రక్రియ సమయంలో ప్రతి 2 మీటర్లకి 20 సెంటీమీటర్ల వెడల్పున కాలిబాటలు ఏర్పాటు చేయాలి. దీని వలన పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడల ఉధృతి కొంతవరకు అదుపు చేయవచ్చు.
- ముదురు నారు నాటిన 15 రోజుల్లోగా కార్బోఫ్యూరాన్ 3–జీ గుళికలు ఎకరానికి 8 కిలోల చొప్పున వేసుకుంటే తొలి దశలో కాండం తొలుచు పురుగు ఉధృతి నియంత్రించవచ్చు.

నియోజకవర్గంలో సాగు వివరాలు..

మండలం	సాగు విస్తీర్ణం హెక్టార్లలో	రైతులు
పాలకొండ	6,345	12,901
వీరఘట్టం	7,112	14,201
సీతంపేట	3,079	9,173
భామిని	3,778	7,549



ముదురు నారును వరుస క్రమంలో నాట్లు వేస్తున్న వ్యవసాయదారులు

హామీలన్నీ నెరవేర్చకుండా కూటమి మోసగిస్తోంది..

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్‌బాబు

కొమరాడ: ఎన్నికల హామీలన్నీ అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తూ ప్రజలను మోసగిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్‌బాబు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో సోమవారం పర్యటించిన ఆయన ఇంటింటికీ వెళ్లి, కూటమి మోసాలను వివరించారు. ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి ప్రజలకు అనేకానేక హామీలిచ్చారని, అయితే వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాలం దాటినా వారిచ్చిన చాలా రకాల హామీల్లో కనీస హామీలు అమలు చేయలేకపోయారన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేసి, అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలు అందివ్వడం జరిగిందని గుర్తు చేశారు.

–పథకాలివ్వడంలో జాప్యం..

ప్రస్తుతం అధికారంలోని కూటమి సర్కారు మాత్రం పథకాలు ఇవ్వడంలో ఎంత జాప్యం చేస్తే అంత మంచిదన్నట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇప్పుడు వారిచ్చిన రెండు, మూడు పథకాల్లోనూ అర్హులకు అన్యాయమే జరిగిందన్నారు. ఏ పథకం ఎవరికి ఇస్తున్నారో ఎవరికి డబ్బులు వేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. మహిళలకు ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్‌లు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా చేస్తున్న పోరాటాల వల్లే కూటమి పథకాలు అందిస్తోందని, లేకుంటే అవి కూడా రావన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని, అంతవరకు వైఎస్సార్ సీపీ తరఫున పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కెంగువ పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



కూటమి మోసాలపై ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని బీజేపురంలో జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు తదితరులు పాల్గొని, ప్రజలకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపత్‌కుమార్, నారాయణరావు, వెంకటరమణ, సూర్యారావు, సుజాత, మన్మథరావు, గణేష్ మురళి, శివనాయుడు తదితరులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస రూరల్: బీజేపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

గుమ్మలక్ష్మీపురం: బాలికలు, విద్యార్థినులు, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎల్విన్‌పేట ఎస్‌ఐ బి.శివప్రసాద్ హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత, లైంగిక వేధింపుల నుంచి బయటపడడం వంటి వాటిపై సోమవారం అవగాహన కల్పించారు. ఒక్కోసారి క్షణికావేశంలో చేసిన తప్పులే జీవితకాలం శిక్ష పడేలా చేస్తాయని, ఏ ఒక్కరూ మహిళలను ఇబ్బంది పెట్టవద్దని, మంచి నడవడిక కలిగి ఉండాలని తెలిపారు. అలాగే మహిళలకు కూడా ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు అపారంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరూప, వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువు గట్టుపై మొక్కలు నాటండి

జియ్యమ్మవలస రూరల్: ప్రతి ఊరిలోని చెరువు గట్లపై మొక్కలు నాటాలని ఎంపీడీవో కె.ధర్మారావు కోరారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం బి.శివున్నాయుడు అధ్యక్షతన సోమవారం జరిగిన వీవోఏల సమావేశానికి ఆయన హాజరై, పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి పంచాయతీలో కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని గ్రామ సంఘాలకు ప్రభుత్వం అప్పగిచ్చిందన్నారు.

తల్లిపాలే అమృతం



తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకత, పౌష్టికాహార ప్రయోజనాలపై ఐసీడీఎస్ అధికారులు సోమవారం అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని, ఆ పాలే బిడ్డకు అమృతంతో సమానమని తెలిపారు. ప్రతి తల్లి కూడా పుట్టిన బిడ్డకు కనీసం ఆరు నెలల పాటు పాలు ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రతిఒక్కరూ రోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు. –కొమరాడ, గుమ్మలక్ష్మీపురం

మహిళా మార్టు అభివృద్ధికి సహకరించాలి

వీరఘట్టం: మహిళల ఆర్థిక స్వావలంబనకు వీరఘట్టంలో ఏర్పాటు చేసిన మహిళా మార్టు వ్యాపారాభివృద్ధికి అన్ని డ్వాక్రా సంఘాలు సహకరించాలని ఏపీఎం కె.రాము కోరారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా సంఘ సభ్యులతో ఆయన మాట్లాడారు. స్థానిక మార్కెట్ కంటే తక్కువ ధరలకే కిరాణా, ఇతర నిత్యావసర సరుకులు మార్టులో లభ్యమవుతున్నాయన్నారు. మార్టులో వ్యాపారం జరిగితే వచ్చే లాభాలు అన్ని సంఘాలకు వర్తిస్తాయని చెప్పారు.

ఈ సెల్‌ఫోన్లు మాకొద్దు..



గుమ్మలక్ష్మీపురం: ఫోన్లు ఇవ్వడానికి వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు

సీతంపేట: ఈ సెల్‌ఫోన్లు మాకొద్దు బాబోయ్ అని అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. ప్రభుత్వం తీరుకు నిరసనగా సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీడీపీఓకు మొబైల్‌ఫోన్లు అప్పగించారు. ఈ సందర్భంగా కార్యకర్తల యూనియన్ నాయకురాలు పార్వతి మాట్లాడుతూ.. ఫేస్‌యాప్ అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సిగ్నల్ సమస్యల వలన నానా అవస్థలు పడాల్సి వస్తోందని, వెంటనే ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్వతి, అరుణ, దర్శమ్మి, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత..

పాలకొండ: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సెల్‌ఫోన్లను సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అప్పగించారు. ఈసందర్భంగా యూనియన్ నాయకురాలు బి.అలివేణి మాట్లాడుతూ..నాణ్యత లేని సెల్‌ఫోన్లతో పని చేయలేకపోతున్నామన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని.. నాణ్యమైన సరుకులు అందించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జెస్సీబాయ్, కార్యర్తలు పాల్గొన్నారు.



పాలకొండ: సెల్‌ఫోన్‌లు అప్పగిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గుమ్మలక్ష్మీపురం: యాప్‌ల వల్ల తీవ్రమైన పనిభారంతో పాటు మానసిక ఒత్తిడికి గురవుతున్నామని భద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయానికి వెళ్లి, తమకు ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్‌ఫోన్లను వెనక్కి ఇచ్చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.గౌరీశ్వరరావు, ఎం.రమణ, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం నాయకులు సత్యవతి, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట: సెల్‌ఫోన్‌లతో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అవగాహన

సీతంపేట: ఘాట్‌రోడ్ నుంచి కిందకు వచ్చేటప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో గేర్‌లోనే రావాలని.. ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ఫ్ ఆఫ్ చేయరాదని ఎస్సై వై.అమ్మన్నరావు సూచించారు. మండల కేంద్రంలో ఆటోడ్రైవర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు తప్పవన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అమ్మన్నరావు

ఆర్‌ఎంపీలపై ఆంక్షలు తొలగించాలి

పాలకొండ: గ్రామాల్లో కష్టకాలంలో వైద్య సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీలపై ఆంక్షలు తొలగించాలని ఆ యూనియన్ నాయకులు కోరారు. యూనియన్ నాయకుడు పల్లా కొండలరావు ఆధ్వర్యంలో పలువురు ఆర్‌ఎంపీలు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రాధాకృష్ణమూర్తిని కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ప్రస్తుత ఆర్‌ఎంపీలందరూ లైసెన్స్‌లు పొంది ఉండాలని నిబంధన తీసుకురావడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఆర్‌ఎంపీల విషయంలో వెసులుబాటు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణంలోని ఆర్‌ఎంపీలు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్‌ఎంపీలు

అభివృద్ధి పనులకు శ్రీకారం

పాలకొండ: కోటదుర్గమ్మ ఆలయ పరిసరాల్లో పలు అభివృద్ధి పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. దసరా ఉత్సవాల సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పనులు ప్రారంభిస్తున్నట్లు అధికారులు చెప్పారు. షిర్డీసాయి ఆలయ ధర్మకర్త పల్లా కొండలరావు సహకారంతో అక్కడి ప్రైవేట్ స్థలాలను ఆలయానికి అప్పగించేందుకు చర్యలు తీసుకున్నారు. కళాభారతి క్లబ్ ఉండే స్థలాన్ని స్థల యజమాని పైడి కృష్ణప్రసాద్ ఆలయానికి అప్పగించగా.. భక్తుల అవసరాల కోసం నిర్మాణాలు చేపడుతున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ, ఆలయ ఈఓ సూర్యనారాయణ, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కృష్ణప్రసాద్, తదితరులు

వీఆర్‌ఏలకు తగిన గుర్తింపు ఇవ్వాలి

వీరఘట్టం: వీఆర్‌ఏలకు తగిన గుర్తింపు ఇవ్వాలని.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సి ఉన్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని పలువురు వీఆర్‌ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖ ద్వారా ఏ కార్యక్రమం చేపట్టినా వీఆర్‌ఏలు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఎంత కష్టపడి చేస్తున్నా కనీస వేతనాలు లేవని.. 11 వేల రూపాయలతో కుటుంబాలను ఎలా నెట్టుకురాగలమని ప్రశ్నించారు. దీనికి తహసీల్దార్ స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.



తహసీల్దార్ కామేశ్వరరావుకు సమస్యలు వివరిస్తున్న వీఆర్‌ఏలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 36 వినతులు

సీతంపేట: ఐటీడీఏ కార్యాలయంలో పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 36 వినతులు అందాయి. గ్రామానికి సీసీ రహదారి మంజూరు చేయాలని పులిగుమ్మి గిరిజనులు వినతిపత్రం ఇచ్చారు. డెయిరీ ఫారం పెట్టుకోవడానికి రుణం ఇప్పించాలని జగ్గడుగూడకు చెందిన జయమ్మ కోరారు. టార్పాలిన్లు ఇప్పించాలని జలుబుగూడ గ్రామస్తులు కోరారు. అలాగే వివిధ సమస్యలపై పలువురు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ఈఈ కుమార్, డిప్యూటీ ఈఓ రామ్మోహనరావు, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, పీహెచ్‌ఓ గణేష్, వ్యవసాయాధికారి వాహిని, ఏఎంఓ కోటిబాబు, ఎస్సై అమ్మన్నరావు, తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

కిటకిటలాడిన ఏరియా ఆస్పత్రి

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రి సోమవారం రోగులతో కిటకిటలాడింది. ఓపీ విభాగానికి 382 మంది రోగులు రాగా 99 మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఇందులో 42 మందిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని వైద్యసేవలు అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు. అవసరమైన వారికి మందులు అందజేశామన్నారు.



వైద్యసేవల కోసం వచ్చిన రోగులు

చురుగ్గా సోషల్ ఆడిట్

గరుగుబిల్లి: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీలు) చురుగ్గా జరుగుతోంది. దళాయివలస, రావివలస, గొట్టివలస, పెద్దూరు, సంతోషపురం గ్రామాల్లో సోమవారం జరిగిన ఆడిట్‌లో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు జరిగిన ఉపాధి పనులపై ఆడిటర్లు ఆరాతీశారు. ఆడిట్ అనంతరం ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందని, అందులో పనుల వివరాలు, ఏవైనా జరిగిన అక్రమాలు ఉంటే వెల్లడించడం జరుగుతుందని స్టేట్ రిసోర్స్‌పర్సన్ పున్నపునాయుడు తెలిపారు.



దళాయివలసలో ఉపాధి పనులపై ఆరాతీస్తున్న ఆడిట్ అధికారులు

ఉల్లిభద్ర ముఖద్వారం ప్రారంభం

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర గ్రామ ప్రవేశ స్థలం వద్ద కొత్తగా నిర్మించిన ముఖద్వారాన్ని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు కలిసి సోమవారం ప్రారంభించారు. గ్రామ సీనియర్ నాయకుడు స్వర్గీయ శెట్టి అప్పలస్వామినాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఈ ముఖద్వారాన్ని నిర్మించారు. కార్యక్రమంలో సర్పంచ్ శెట్టి దివ్యలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు, పార్టీ మండల కన్వీనర్ అచ్యుతరావు పాల్గొన్నారు.



ముఖద్వారం వద్ద మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు